సాక్షి విశాఖపట్నం
శుక్రవారం । 13 । జూన్ । 2025


వేటకు వేళాయె 8లో


కొత్తగా కళ్లు తెరిచెనే.! 8లో


సీఎన్‌సీ ప్లాస్మా కటింగ్ మెషీన్ ప్రారంభం 8లో

ఏసీబీ ప్రక్షాళన

సాక్షి ఎఫెక్ట్..

- ఆరోపణలున్న సిబ్బందిపై బదిలీ వేటు?
- ఐదేళ్లు పూర్తయిన మరికొందరికి స్థానచలనం
- సాక్షి కథనాలకు స్పందన

విశాఖ సిటీ: అవినీతి నిరోధక శాఖలో ప్రక్షాళన షురూ అయింది. అవినీతి ఆరోపణలు ఉన్న సిబ్బందిపై ఎట్టకేలకు బదిలీ వేటు పడింది. దీర్ఘ కాలంగా ఏసీబీలో తిష్టవేసుకుని కూర్చున్న వారికి స్థానచలనం కలిగింది. ఏసీబీలో అవినీతి సిబ్బందిపై 'సాక్షి' వరుస కథనాలతో ఉన్నతాధి కారులు దృష్టి సారించారు. వీరితో పాటు ఐదేళ్ల నిబంధన ప్రకారం పలువురికి బదిలీ చేస్తూ ఏసీబీ డీజీ అతుల్ సింగ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. విశాఖ ఏసీబీలో పలువురి వ్యవ హార శైలిపై మొదట్నుంచి ఆరోపణలు విని పిస్తూనే ఉన్నాయి. ఉన్నతాధికారుల పేరు చెప్పి పలు ప్రభుత్వ శాఖల్లో భారీగా వసూళ్లకు తెరలే పారన్న వార్తలు వినిపించాయి. ప్రధానంగా రిజి స్ట్రేషన్, రెవెన్యూ, రవాణా శాఖల నుంచి నెలసరి మామూళ్లకు అలవాటు పడ్డారన్న గుస గుసలు ఉన్నాయి. ఏసీబీలోనే దండిగా ఆదాయం వస్తుం డడం కొంత మంది సిబ్బంది రాజకీయ నేతల ఆశీస్సులతో ఇక్కడి నుంచి వెళ్లకుండా తిష్టవేసి నట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రధానంగా ఒక ఎస్ఐ, ఒక హెచ్‌సీ ఏసీబీలో చక్రం తిప్పినట్లు ఆఫీస్‌లోనే చర్చ జరుగుతోంది. ఉన్నతాధి కారుల పేరుతో వీరు చేస్తున్న దందాపై 'సాక్షి' వరుస కథనాలతో అధికారులు ఉలిక్కిపడ్డారు. దీనిపై అంతర్గత విచారణ చేపట్టి అవినీతి ఆరో పణలు ఉన్న వారితో పటు ఐదేళ్ల నిబంధన ప్రకారం బదిలీలు చేపట్టారు. వీరిలో ఎస్ఐలు బి.సురేష్, కె.శ్రీనివాసరావులను విశాఖ రేంజ్ డీఐజీకి రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలాగే హెచ్‌సీలు టి.కొండల రావు, ఎం.సత్యనారాయణ, ఆర్.చంద్రశేఖర్‌నా యుడు, కానిస్టేబుల్ ఎస్.రమేష్‌లను విశాఖ సీపీకి కేటాయించారు. అదే విధంగా హెచ్‌సీ జి.రాంబాబు, కానిస్టేబుళ్లు కె.రామకిరణ్, టి.శ్రీనివాసరావులను అనకాపల్లి ఎస్పీకి రిపోర్టు చేయాలని ఆదేశించారు.

అనుమతుల్లేకుండా గోడ కూల్చివేత

ఏఎంటీజెడ్‌పై స్టీల్‌ప్లాంట్ ఆగ్రహం

పెదగంట్యాడ: జీవీఎంసీ 77వ వార్డు పరిధి మదీనా బాగ్ సమీపంలోని ప్రగతి మైదానం వద్ద ఏఎంటీజెడ్ అధికారులు అనుమతులు లేకుండా స్టీల్‌ప్లాంట్ గోడను కూల్చివేశారు. తమ వ్యాపార ప్రయోజనాల కోసం ఇటీవల ఏఎంటీజెడ్ ప్రాంగణంలో పిలానీ పబ్లిక్ స్కూల్ నిర్మించారు. అయితే విద్యార్థులు, బస్సులు నేరుగా వెళ్లేందుకు వీలుగా సుమారు 30 మీటర్ల మేర గోడను గత నెలలో కూల్చివేసి, అక్కడ గేటును ఏర్పాటు చేశారు. ఈ విషయం తెలుసుకున్న స్టీల్‌ప్లాంట్ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని ఏఎంటీజెడ్ అధికారులను ప్రశ్నించారు. అయితే ఏఎం టీజెడ్ అధికారులు స్టీల్‌ప్లాంట్ అధికారుల మాటలను లెక్కచేయకుండా, వారిని అడ్డుకున్నప్పటికీ వెనక్కి తగ్గకుండా తమ పనిని కొనసాగించారు. గురువారం స్టీల్‌ప్లాంట్ అధికారులు మళ్లీ అడ్డుకునే ప్రయత్నం చేయగా.. ఏఎంటీజెడ్ అధికారులు వారితో వాగ్వాదా నికి దిగారు. స్టీల్‌ప్లాంట్ అధికారులపై దుర్భాష లాడారు. 'మా వెనకాల ప్రభుత్వం ఉంది. మీరు ఏం చేయలేరు.' అని బెదిరించారని స్టీల్‌ప్లాంట్ అధికా రులు వాపోయారు. దీనిపై న్యాయపరంగా చర్యలు తీసుకుంటామని, ఎస్టేట్ కోర్టులో ఫిర్యాదు చేస్తామని స్టీల్‌ప్లాంట్ అధికారులు తెలిపారు. 2013లో స్టీల్‌ప్లాం ట్ నిర్మించిన ఈ గోడను అడ్డగోలుగా కూల్చి గేటు ఏర్పాటు చేయడం సరికాదని, దీని వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. స్టీల్‌ప్లాంట్ ఉన్నతాధికారుల అనుమతి తీసుకోకుండా ఇలాంటి చర్యలకు పాల్పడటం సరి కాదని పేర్కొన్నారు.


గోడ కొట్టేసి ఏర్పాటు చేసిన గేటు

బడిలో సమస్యల గంట



- తొలి రోజు హాజరు అంతంతమాత్రమే
- అరకొరగా పుస్తకాల పంపిణీ
- కానరాని బ్యాగులు, బూట్ల పంపిణీ
- జమకాని తల్లికి వందనం నగదు
- తల్లిదండ్రుల్లో తీవ్ర నిరాశ

ఆరిలోవ: వేసవి సెలవుల సందడి ముగిసింది. బడి గంట మోగింది. గురువారం నుంచి కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో పాఠశాలలు తిరిగి తెరుచుకున్నాయి. సెలవుల్లో ఆటపాటలతో హాయిగా గడిపిన విద్యార్థులు.. మొదటి రోజు బడికి వెళ్లడానికి అయిష్టత చూపారు. చాలామంది చిన్నారులు 'బడికి వెళ్లం' అంటూ మారాం చేయ డంతో, వారి తల్లిదండ్రులు నచ్చజెప్పి పాఠశాల లకు తీసుకురావాల్సి వచ్చింది. తమ పిల్లలను పాఠ శాలల వద్ద దగ్గరుండి దింపి, జాగ్రత్తలు చెప్పి పం పించారు. పుస్తకాల బ్యాగులను వీపుపైకి ఎత్తుకుని చిన్నారులు బడి బాట పట్టారు.

స్వాగతం పలికిన అసౌకర్యాలు

బడికి వచ్చిన విద్యార్థులకు కొన్ని ప్రభుత్వ పాఠ శాలల్లోని అసౌకర్యాలు స్వాగతం పలికాయి. కొన్ని చోట్ల మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరగా, మరికొన్ని తరగతి గదుల్లో ఫ్యాన్లు విరిగిపోయి ఉన్నాయి. రెం డు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పాఠశాల మైదానాలు బురదమయంగా మారాయి. విద్యా ర్థులు ఆ బురద నీటిని దాటుకుంటూ తరగతి గదులకు వెళ్లాల్సి వచ్చింది.

విద్యార్థి కిట్ల పంపిణీ ఎక్కడ?

పాఠశాలలు తెరిచిన రోజే సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లు పంపిణీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. మొదటి రోజు నుంచే విద్యార్థుల వద్ద పాఠ్య పుస్తకాలు అందుబాటులో ఉంటాయని చెప్పింది. అయితే ఈ ప్రకటనలు కార్యరూపం దాల్చలేదు. మొదటి రోజు హాజరైన విద్యార్థులకు చాలా పాఠశాలల్లో కిట్లు పంపిణీ చేయలేదు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచిన సందర్భంగా కూటమి పార్టీల నేతలు సంబరాలు చేసుకున్నారు. వారు లేకుండా కిట్లు పంపిణీ చేస్తే ఎక్కడ రాద్ధాం తం చేస్తారో అని ప్రధానోపాధ్యాయులు భయపడి పంపిణీ చేపట్టలేదు.


పిచ్చి మొక్కలతో నిండిన క్వీన్‌మేరీస్ పాఠశాల ప్రాంగణం, మూలకు చేరిన ఆట పరికరాలు

సగం మందికే తల్లికి వందనం

ఎన్నికల ముందు కూటమి నేతలు ప్రతి కుటుంబంలో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి రూ.15 వేలు చొప్పున 'తల్లికి వందనం'కిం ద జమ చేస్తామని హామీలు గుప్పించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచిపోయింది. మొదటి సంవత్సరం ఈ పథకాన్ని అమలు చేయకుండా ఎగ్గొ ట్టేసింది. రెండో ఏడాది పాఠశాలలు తెరిచే నాటికి తల్లికి వందనం నిధులు జమ అవుతాయని ఆశించిన తల్లిదండ్రులకు నిరాశే ఎదురైంది. కాగా.. జిల్లాలో సగం మంది విద్యార్థులకే తల్లికి వందనం అందనుం ది. ఇందుకు సంబంధించి జీవో నంబర్లు 26, 27 ప్రకారం లబ్ధిదారులను ఎంపిక చేసిన జాబితాను విద్యా శాఖాధికారులు ప్రకటించారు. ఈ జాబితాలో ఉన్న విద్యార్థుల తల్లుల బ్యాంక్ ఖాతాల్లో జూలై 5న ఆర్థిక సాయం చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించిం ది. జిల్లాలో 1,90,433 మంది విద్యార్థులు, 1,30, 706 మంది తల్లుల జాబితా సిద్ధమైంది. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న అర్హులైనవారంద రికీ తల్లికి వందనం ఇస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. ప్రస్తుతం జిల్లాలో 1,388 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 3,22,737 మంది విద్యార్థు లున్నారు. వీరితో పాటు సుమారు 70 వేల మంది ఇంటర్ విద్యార్థులు కలిపి దాదాపు 4 లక్షల మంది ఉన్నారు. వీరందరికీ తల్లికి వందనం నిధులు వేయాల్సి ఉంది. అయితే ప్రస్తుతం 1,90,433 మం ది విద్యార్థులకు మాత్రమే ఆర్థిక సాయం చేయడా నికి జాబితా సిద్ధం చేశారు. వారికి కూడా పలు నిబం ధనలు వర్తించాలి. పిల్లలు, తల్లిదండ్రుల ఆధార్ నం బర్లు వ్యాలిడేట్ అయి ఉండాలి. నెలవారీ ఆదాయం గ్రామాల్లో రూ.10,000, పట్టణాల్లో రూ.12,000 మించికూడదు. మాగాణి భూమి 3 ఎకరాలు, మెట్ట భూమి 10 ఎకరాలు మించి ఉండకూడదు. నెలసరి 300 యూనిట్లు మించి కరెంట్ వినియోగం ఉండకూ డదు. ఆ నిబంధనలకు లోబడి ఉన్న ఒకటి నుంచి 10వ తరగతి విద్యార్థుల తుది జాబితాను ఈ నెల 12 నుంచి 28 వరకు, ఇంటర్ విద్యార్థుల జాబితా ఈ నెల 30న సిద్ధం చేసి గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రకటించనున్నట్లు అధికారులు వెల్లడించారు.

తొలిరోజు బడులు వెలవెల

జిల్లాలో మొత్తం 1,388 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలున్నాయి. వీటిలో ఒకటి నుంచి 10వ తరగతి వరకు సుమారు 3,22,737 మంది విద్యా ర్థులు చదువుతున్నారు. దీంతో పాటు కొత్తగా ప్రవే శాలు కూడా జరుగుతున్నాయి. దీంతో వీటి సంఖ్య కొంత వరకు పెరగనుంది. ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో 72,627 మంది, ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో 2,50,110 మంది విద్యార్థులు చదువు తున్నారు. అయితే

తొలి రోజు ఎక్కువ మంది విద్యార్థులు పాఠ శాలలకు హాజరుకాలేదు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరుశాతం అంతంత మాత్రంగానే కనిపించింది. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో కేవలం 30 శాతం మంది విద్యార్థులు హాజరుకాగా, ప్రైవేట్, కార్పొరేట్ పాఠ శాలల్లో ఈ సంఖ్య 40 నుంచి 45 శాతంగా నమో దైంది. దీంతో తరగతి గదులు, పాఠశాల ప్రాంగ ణాలు విద్యార్థుల సందడి లేక వెలవెలబోయాయి.


జిల్లాలో తోటగరువు హైస్కూల్ గదిలో హాజరైన పదో తరగతి విద్యార్థులు

ఉలికిపాటు

- ఎస్ఎస్ ఫార్మా గ్యాస్ లీక్ ఘటనతో కలకలం
- గత ప్రమాదాల నుంచి నేర్చుకోని యాజమాన్యం
- ప్రభుత్వ ఉదాసీనతే కారణమన్న ఆరోపణలు

పరవాడ: అనకాపల్లి జిల్లా పరవాడలోని జవహ ర్‌లాల్ నెహ్రూ ఫార్మాసిటీలో జరుగుతున్న వరుస ప్రమాదాలతో ఫార్మా ఉద్యోగులు, కార్మి కులు ఉలికి పడుతున్నారు. తరచూ ఫార్మా పరి శ్రమల్లో చోటుచేసుకుంటున్న అగ్ని ప్రమాదాలు, గ్యాస్ లీక్ ఘటనలతో సమీప గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఎస్ఎస్ ఫార్మా పరిశ్రమలో సాల్వెంట్ ట్రీట్‌మెంట్ ప్లాం ట్‌లో గురువారం తెల్లవారు జామున జరిగిన గ్యాస్ లీకేజీ ఘటనలో పరిశ్రమలో సేఫ్టీ మేనే జర్‌గా పనిచేస్తున్న హైదరాబాద్‌కు చెందిన పరిమి చంద్రశేఖర్(32), షిఫ్ట్ సేఫ్టీ ఆఫీసర్‌గా పనిచేస్తున్న అనకాపల్లి జిల్లా మునగపాకకు చెం దిన శరగడం కుమార్(25) మృత్యువాత పడ్డారు. హెల్పర్‌గా పనిచేస్తున్న ఒడిశాకు చెం దిన బైడు బైసాల్(37) ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

వరుస ప్రమాదాలతో భయాందోళన

- **గతంలో సినర్జిన్ యాక్టివ్ పరిశ్రమలో జరిగిన** బాయిలర్ పేలుడు ఘటనలో జార్ఖండ్‌కు చెం దిన ముగ్గురు, ఒడిశాకు చెందిన ఒకరు, విజయ నగరానికి ఒకరు ప్రాణాలు కోల్పోయారు.
- రక్షిత్ డ్రగ్స్ ఫార్మాలో గత డిసెంబర్‌లో ప్రొడ క్షన్ బ్లాక్‌లో హైడ్రోజన్ సల్ఫైడ్ గ్యాస్ లీకై న ఘటనలో కాంట్రాక్టు కార్మికులు దేవిబాగ్, ఉగ్రే సర్‌గాడ్‌లు అస్వస్థతకు గురయ్యారు.
- గత ఏప్రిల్‌లో అపిటోరియా పరిశ్రమ యూని ట్-6లో నైట్రోజన్ గ్యాస్ పీల్చడంతో విజయ నగరం జిల్లా గంట్యాడ మండలం సిరిపురం గ్రామానికి చెందిన ఆళ్ల గోవింద్ మృతి చెందాడు.
- ఆల్కలీ మెటల్ ఫార్మా పరిశ్రమలో ఏప్రిల్‌లో జరిగిన మరో ఘటనలో మిథైల్ నైట్రేట్ గ్యాస్ లీకై విజయనగరం జిల్లా పూసపాటిరేగ మం డలం గొల్లపేటకు చెందిన సీహెచ్ రమణ(32) మృతి చెందాడు. మరో నలుగురు తీవ్ర అస్వస్థ తకు గురయ్యారు.
- అదే నెలలో ఠాగూర్ లేబొరేటరీస్ పరిశ్రమలో రియాక్టర్‌ను శుభ్రం చేస్తున్న క్రమంలో రియాక్టర్ వాల్వ్ నుంచి విడుదలైన విషవాయువును పీల్చడం వల్ల కె.సింహచలం అనే కాంట్రాక్టు కార్మికుడు అస్వస్థతకు గురయ్యాడు. అనంతరం ఆస్పత్రికి తరలించి మెరుగైన వైద్యం అందించ డంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు.
- మెట్రికెమ్ పరిశ్రమలో ఖాళీ రసాయన డబ్బాలు, వ్యర్థాల వల్ల ప్రమాదం నెలకొంది. యాజమాన్యం వెంటనే స్పందించడంతో కార్మి కులు ఊపిరి పీల్చుకున్నారు.


ఎస్ఎస్ ఫార్మాలో గ్యాస్ లీకైన ప్రదేశం


ఎస్ఎస్ ఫార్మా గ్యాస్ లీక్ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుం బాలకు చెరో రూ.55 లక్షల చొప్పున నష్ట పరిహారం చెల్లించేందుకు అంగీకారం కుదిరింది. పరవాడ తహసీల్దార్ ఎస్వీ అంబేద్కర్, సీఐ ఆర్.మల్లికార్జునరావు సమక్షంలో బాధిత కుటుంబాలకు మాజీ జెడ్పీటీసీ సభ్యుడు పైల జగన్నాథరావు నష్టపరిహారం చెక్కులను అందించారు.

మృతుల కుటుంబాలకు రూ.కోటి పరిహారమివ్వాలి

మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్

మహారాణిపేట: పరవాడలోని జేఎన్ ఫార్మాసి టీలో ఉన్న ఎస్ఎస్ ఫార్మా గ్యాస్ లీక్ ఘటనలో మృతి చెందిన పరిమి చంద్రశేఖర్(తెలంగాణ), శరగడం కుమార్(మునగపాక) కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం అందించాలని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ డిమాండ్ చేశారు. కేజీహెచ్ మార్చురీ వద్ద మృతుల కుటుంబాలను గురువారం ఆయన పరామర్శిం చారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్ మాట్లాడుతూ విశాఖ పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ప్రమాదాల నివా రణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఎసెన్షియా ఫార్మా తదితర కంపెనీల్లో జరిగిన ప్రమాదాల్లో చాలా మంది మరణించారని పేర్కొన్నారు. కంపెనీల్లో భద్రతా ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎప్పటికప్పుడు సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని తెలిపా రు. ఇలాం టి ప్రమాదాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. బాధిత కుటుం బాలకు న్యాయం జరిగే వరకూ అండగా ఉం టామని భరోసానిచ్చారు. ఏడాది కాలంలో ఇన్ని ప్రమాదాలు ఎప్పుడూ జరగలేదన్నారు. గతం లో జరిగిన ప్రమాదంలో ఎలా నష్ట పరిహారం ఇచ్చారో అలాగే ఇవ్వాలని డిమాండ్ చేశారు.


కేజీహెచ్ వద్ద బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి అమర్‌నాథ్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్

పోస్ట్‌మార్టం పూర్తి

ఎస్ఎస్ ఫార్మా గ్యాస్ లీక్ ఘటన మృతదే హాలకు కేజీహెచ్‌లో పోస్టుమార్టం నిర్వహించారు. మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం అందించాలని సిటు జిల్లా ఉపాధ్య క్షుడు గనిశెట్టి సత్యనారాయణ, సీపీఎం నాయ కులు డిమాండ్ చేశారు. గాయపడిన హెల్పర్ బైడూ బైసాల్‌కు మెరుగైన వైద్యం అందించి, పరి హారం ప్రకటించాలన్నారు. కంపెనీ ప్రతిని ధులు, కుటుంబ సభ్యుల మధ్య చర్చలు జరి గాయి. నష్టపరిహారానికి హామీ ఇవ్వడంతో పోస్ట్ మార్టం ప్రారంభించారు. సాయంత్రానికి రెండు మృత దేహాలకు బంధువులకు అప్పగించారు.

సీఎం విశాఖ పర్యటన రద్దు

మహారాణిపేట: అహ్మదాబాద్‌లో ఎయిర్ ఇండియా విమాన ప్రమాద ఘటన నేపథ్యంలో విశాఖలో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన రద్దయింది. శుక్రవారం ఆయన విశాఖలో పలు కార్యక్రమాల్లో పాల్గొ నాల్సి ఉంది. ఇందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు కూడా పూర్తి చేసింది.

విమాన ప్రమాద ఘటనపై కేకే రాజు దిగ్భ్రాంతి

నేడు జరగాల్సిన 'ఫీజు పోరు' వాయిదా



సాక్షి, విశాఖపట్నం: అహ్మదా బాద్‌లో విమాన ప్రమాద ఘటనపై వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ విషాద ఘటన తనకు చాలా బాధ కలిగించిందని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాలను భారత ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. ఈ నేపథ్యంలో ఈ నెల 13వ తేదీన వైఎ స్సార్ సీపీ ఆధ్వర్యంలో తలపెట్టిన 'ఫీజు పోరు' వాయిదా వేశామని తెలిపారు.

ఇది హృదయ విదారక ఘటన

విమాన ప్రమాద మృతులకు మాజీ మంత్రి అమర్‌నాథ్ సంతాపం

సాక్షి, విశాఖపట్నం : అహ్మదాబాద్‌లో ఎయిరిండియా విమాన ప్రమాద ఘటన చాలా దురదృష్టకరమని.. ఇది తమను ఎంతో బాధించిందని మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మద్దిలపాలెం పార్టీ కార్యాల యంలో వైఎస్సార్ సీపీ నేతలు మృ తుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. ప్రమాదంలో చనిపోయిన వారి కుటుంబీకుల దుఃఖాన్ని ఊహిం చడం కష్టమని.. అందరికీ తట్టుకునే బలాన్ని, ధైర్యం ఇవ్వాలని ఆ భగవం తుడిని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. బాధిత కుటుంబాలను ఆదుకోవాలని వైఎస్సార్‌సీపీ నుంచి కేంద్ర ప్రభు త్వాన్ని కోరుతున్నామన్నారు. విశాఖ తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పా రావు, ముఖ్య నేతలు పేర్ల విజయచం దర్, రవిరెడ్డి, బోని శివరామకృష్ణ, అల్లంపల్లి రాజబాబు, పీతల గోవింద్ తదితరులు సంతాపం తెలిపారు.


సంతాపం వ్యక్తం చేస్తున్న మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చిత్రంలో విశాఖ తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు

'సాక్షి' విలేకరి హఠాన్మరణం


రామకృష్ణ (ఫైల్)

గాజువాక: 'సాక్షి' అక్కిరెడ్డి పాలెం విలేకరి బి.రామకృష్ణ హఠాన్మరణం చెందారు. దీంతో 'సాక్షి' సిబ్బంది దిగ్భ్రాంతికి గురయ్యారు. గురువారం విధులను ముగించుకుని కంచరపాలెంలోని తన సోదరి ఇంటికి వెళ్లిన రామకృష్ణ గుండెపోటుకు గురయ్యారని సమీప బంధువులు తెలిపారు. విషయాన్ని గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆయన్ని సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. 'సాక్షి' దినపత్రికలో అక్కిరెడ్డిపాలెం విలేకరిగా రామకృష్ణ కొన్నేళ్లుగా పని చేస్తున్నారు. నిరంతరం ఆయన ప్రజా సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకొచ్చే కథనాలను అందించారు. ఆయన మృతికి 'సాక్షి' సిబ్బంది, సహచర విలేకరులు సంతాపం ప్రకటించారు. జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు రిపోర్టర్ రామకృష్ణ భౌతికకాయం వద్ద నివాళులర్పించారు.

కొత్తగా కళ్లు తెరిచెనే.!


రెడ్-నెకెడ్ వాలబీ సంచిలో వేలాడుతున్న పిల్ల

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూలాజికల్ పార్కులో రెండు జంతువుల పిల్లలు సందడి చేస్తున్నాయి. ఇటీవల గర్భం దాల్చిన రెడ్-నెక్డ్ వాలబీ, మౌస్ డీర్ ఒక్కో పిల్లకు జన్మనిచ్చాయి. ప్రస్తుతం తల్లీపిల్లలు రెండూ ఆరోగ్యంగా ఉన్నాయి. మౌస్ డీర్ పిల్ల తన తల్లితో కలిసి ఎన్‌క్లోజర్‌లో చురుకుగా తిరుగుతూ సందర్శకులకు కనువిందు చేస్తోంది. మరోవైపు రెడ్-నెక్డ్ వాలబీ పిల్ల ఇంకా తన తల్లి పొట్టభాగంలోని సంచిలోనే సురక్షితంగా ఉంది. సాధారణంగా రెడ్-నెక్డ్ వాలబీ గర్భం దాల్చిన 30 రోజుల్లోనే పిల్లకు జన్మనిస్తుంది. పుట్టినప్పటి నుంచి ఆ పిల్ల సుమారు ఏడు నెలల పాటు తల్లి సంచిలోనే ఉండి పాలు తాగుతూ పెరుగుతుంది. దాదాపు 12 నెలల వయసు వచ్చాక పూర్తిగా బయటకు వచ్చి స్వతంత్రంగా జీవించడం ప్రారంభిస్తుంది. ఈ రెండు పిల్లలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నాయని జూ క్యూరేటర్ మంగమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. జూలో జంతువుల పునరుత్పత్తి కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగుతున్నాయని, కొన్ని నెలల కిందట కూడా పలు జంతువులు పిల్లలకు జన్మనిచ్చాయని ఆమె పేర్కొన్నారు.

వేటకు వేళాయె

- రేపు అర్ధరాత్రి నుంచి సముద్రంలో చేపలవేట ప్రారంభం
- బోట్లను సిద్ధం చేస్తున్న మత్స్యకారులు


బోట్లలో ఐస్ నింపుకుని సిద్ధం చేసుకుంటున్న మత్స్యకారులు

మహారాణిపేట: మత్స్యకారులు వేటకు సిద్ధమవుతున్నారు. హార్బర్ మళ్లీ కళకళలాడనుంది. రాష్ట్ర ప్రభుత్వం విధించిన వేట నిషేధం గడువు శనివారంతో ముగియనుంది. శనివారం అర్ధరాత్రి నుంచి సముద్రంలోకి వేటకు వెళ్లేందుకు మత్స్యకారులు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇన్నాళ్లూ బోసిపోయిన విశాఖ ఫిషింగ్ హార్బర్ మళ్లీ సందడిగా మారనుంది. ఏప్రిల్ 15న వేట నిషేధం అమలులోకి వచ్చిన సంగతి తెలిసిందే. ఈ విరామ సమయంలో మత్స్యకారులు తమ పడవలకు, వలలకు మరమ్మతులు పూర్తి చేశారు. ఇంజిన్లు, గేర్ బాక్సులు, పంఖాలు వంటి కీలక భాగాలను బాగు చేయించుకుని బోట్లను వేటకు సిద్ధం చేశారు.

గంగమ్మ తల్లికి పూజలు

ప్రతి ఏటా వేట ప్రారంభానికి ముందు గంగమ్మ తల్లిని పూజించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది కూడా వేటలో ఎలాంటి ఆటంకాలు ఎదురవకుండా, గంగమ్మ తల్లి చల్లగా చూడాలని కోరుకుంటూ ఈ నెల 10న హార్బర్‌లో అమ్మవారికి ఘనంగా పూజలు నిర్వహించారు. అమ్మవారికి పసుపు, కుంకుమలతో మొక్కులు చెల్లించుకున్నట్లు రాష్ట్ర మరపడవల సంఘం మాజీ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు వాసుపల్లి జానకీరామ్ తెలిపారు. కాగా.. ఈ నెల 15 నుంచి మత్స్యకారులు తిరిగి వేట ప్రారంభించవచ్చని మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు పి.లక్ష్మణరావు తెలిపారు. అయితే వేటకు వెళ్లేటప్పుడు భద్రతా ప్రమాణాలను విధిగా పాటించాలని సూచించారు. వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేసుకుని, తగిన జాగ్రత్తలతో వేట సాగించాలని కోరారు.

వేటపైనే జీవనాధారం

జిల్లాలో 65 కిలోమీటర్ల తీరప్రాంతంలో ఉన్న 32 మత్స్యకార గ్రామాల్లో సుమారు 1.15 లక్షల కుటుంబాలు మత్స్యకార వృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా 2,547 మర, మోటారు, సంప్రదాయ పడవలు ఉన్నాయి. ఒక్క విశాఖ ఫిషింగ్ హార్బర్‌పైనే ప్రత్యక్షంగా, పరోక్షంగా 25 వేల మంది ఉపాధి పొందుతున్నారు. ఈ 61 రోజుల విరామం వారి జీవనోపాధిపై తీవ్ర ప్రభావం చూపింది. ఇప్పుడు వేట తిరిగి ప్రారంభం కానుండటంతో వారిలో ఆశలు చిగురిస్తున్నాయి.

విధులకు వెళ్తుండగా విధి చిన్నచూపు

- స్కూటీని ఢీకొన్న కంటైనర్
- చెల్లెలు మృతి, అన్నయ్యకు తీవ్రగాయాలు


ప్రమాదానికి కారణమైన లారీ


గీత (ఫైల్)

కూర్మన్నపాలెం : ఆ కుటుంబంపై విధి కన్నెర్రజేసింది. గురువారం ఉదయం అన్నాచెల్లెళ్లు విధులకు స్కూటీపై వెళ్తుండగా తుంగ్లాం రైల్వే గేటుకు సమీపంలో కంటైనర్ ఢీకొంది. ప్రమాదంలో చెల్లెలు ఘటన స్థలంలో మృతి చెందగా అన్నయ్య తీవ్ర గాయాలపాలయ్యాడు. దువ్వాడ పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. యాదవ జగ్గరాజుపేటలో నివాసం ఉంటున్న గొంప శ్రీను, మణి దంపతులకు సతీష్(29), గీత(24) అనే పిల్లలు ఉన్నారు. తండ్రి శ్రీనివాస్ ఒక ప్రైవేటు కంపెనీలో విధులు నిర్వహిస్తున్నాడు. అన్నాచెల్లెళ్లు కూడా ఆటోనగర్‌లోని ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నారు. గురువారం ఉదయం అన్నాచెల్లెళ్లు విధులకు స్కూటీపై వెళ్తుండగా తుంగ్లాం రైల్వేగేటు సమీపంలో కంటైనర్ లారీ వెనుక నుంచి ఢీకొంది. గీత లారీ వెనుక చక్రాల కింద పడి అక్కడికక్కడే మృతి చెందింది. పక్కకు పడిపోయిన సతీష్‌కు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. సతీష్‌ని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ మల్లేశ్వరరావు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. అందివచ్చిన కుమార్తె మృతి చెందడం, కుమారుడు తీవ్రగాయాలపాలవడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

వలస నేతకు అందలమా?

- టీడీపీలో అసమ్మతి జ్వాలలు
- 8వ వార్డులో బయటపడ్డ విభేదాలు
- మూకుమ్మడి రాజీనామాలకు సిద్ధమన్న కార్యకర్తలు


ఆవేదన వ్యక్తం చేస్తున్న టీడీపీ ఎస్సీ నాయకుడు బెల్లాన శ్రీనివాస్

కొమ్మాది: వైఎస్సార్ సీపీ నుంచి టీడీపీలో చేరిన కార్పొరేటర్ లొడగల అప్పారావుకు అధిక ప్రాధాన్యం ఇవ్వడంపై 8వ వార్డు టీడీపీలో తీవ్ర దుమారం రేగింది. పార్టీ అధికారంలో లేనప్పుడు ఐదేళ్లుగా కష్టపడి పని చేసిన తమను కాదని.. కొత్తగా వచ్చిన వారికి పెద్దపీట వేయడంపై ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. గురువారం ఎండాడలో జరిగిన కూటమి ఏడాది పాలన సంబరాల్లో పార్టీలో ఈ విభేదాలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. వివరాల్లోకి వెళితే.. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా 8వ వార్డు ఎండాడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆ పార్టీ ఎస్సీ విభాగం యువ నాయకుడు బెల్లాన శ్రీనివాస్ తన ఆవేదనను బహిరంగంగా వెళ్లగక్కారు. 'ఐదేళ్ల ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పార్టీ కోసం ధర్నాలు, ఆందోళనలు చేసి జైలుకు కూడా వెళ్లాం. ఇప్పుడు పార్టీ అధికారంలోకి వచ్చాక కార్పొరేటర్ లొడగల అప్పారావుకు ప్రాధాన్యమిస్తూ.. మమ్మల్ని పట్టించుకోవడం లేదు. దీనిని బట్టి చూస్తే పార్టీలో కష్టపడే వారికి విలువ లేదని స్పష్టమవుతోంది.' అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా ఐదేళ్లుగా వార్డు అధ్యక్షుడిగా పార్టీకి అనేక సేవలు అందించిన చెట్టిపిల్లి గోపిని ఆ పదవి నుంచి తొలగిస్తున్నారని, ఇది ఎంతమాత్రం సమంజసం కాదని శ్రీనివాస్ అన్నారు. సమస్యలు చెప్పుకోవడానికి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును కలిసేందుకు వెళ్తే ఆయన ముఖం చాటేస్తున్నారని ఆరోపించారు. ఒక వేళ వార్డు అధ్యక్షుడిని మారిస్తే మాత్రం మూకుమ్మడి రాజీనామాలు చేయడానికి కూడా వెనుకాడబోమని హెచ్చరించారు. కాగా.. ఏడాది పాలన సంబరాలను సైతం ఎండాడలో ఒక వర్గం, సాగర్‌నగర్‌లో మరో వర్గం వేర్వేరుగా నిర్వహించడం గమనార్హం. ఈ కార్యక్రమాలకు బీజేపీ, జనసేన స్థానిక నాయకులు హాజరుకాలేదు.

సీఎన్‌సీ ప్లాస్మా కటింగ్ మెషీన్ ప్రారంభం


టగ్ ప్రాముఖ్యతను వివరిస్తున్న చైర్మన్ అంగముత్తు

సింధియా: విశాఖపట్నం పోర్ట్ ట్రస్ట్ కోసం నిర్మిస్తున్న 60టీ బోలార్డ్ పుల్ టగ్ స్టీల్ కటింగ్ వేడుక గురువారం ఘనంగా జరిగింది. హిందూస్థాన్ షిప్‌యార్డ్ హల్ షాప్ వద్ద ఏర్పాటు చేసిన సీఎన్‌సీ ప్లాస్మా కటింగ్ మెషీన్‌ను పోర్ట్ ట్రస్ట్ చైర్మన్ అంగముత్తు ప్రారంభించారు. ముందుగా చైర్మన్ అంగముత్తును హిందూస్థాన్ షిప్‌యార్డ్ సీఎండీ హేమంత్ ఖత్రి ఘన స్వాగతం పలికారు. రెండు సంస్థల మధ్య బలమైన, దీర్ఘకాలిక భాగస్వామ్యాన్ని ప్రతిబింబించేలా జరిగిన ఈ వేడుకలో విశాఖపట్నం పోర్ట్, షిప్‌యార్డ్ కార్మికులు, సీనియర్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా షిప్‌యార్డ్ సీఎండీ మాట్లాడుతూ సముద్ర రంగం అభివృద్ధిలో విశాఖ పోర్ట్, షిప్‌యార్డ్‌లు ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నాయన్నారు. కార్బన్ ఉద్గారాలను తగ్గించే లక్ష్యంతో భవిష్యత్తులో ఎలక్ట్రిక్, హైడ్రోజన్ శక్తితో నడిచే గ్రీన్ టగ్స్ అభివృద్ధికి హెచ్‌ఎస్‌ఎల్ కృషి చేస్తోందని తెలిపారు. పోర్ట్ ట్రస్ట్ చైర్మన్ మాట్లాడుతూ హిందూస్థాన్ షిప్‌యార్డ్ సంస్థ నౌకా నిర్మాణ రంగంలో సృష్టిస్తున్న అద్భుతాలు, నూతన పని విధానాలను అభినందించారు. పోర్ట్ ట్రస్ట్ కోసం నిర్మిస్తున్న టగ్ నిర్మాణ పద్ధతులను వివరించారు.

బాల కార్మికులు లేని సమాజమే లక్ష్యం


సమావేశంలో మాట్లాడుతున్న లోక్ అదాలత్ న్యాయమూర్తి జి.వల్లభనాయుడు

విశాఖ లీగల్ : బాల కార్మికులు లేని సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విశ్రాంత ప్రిన్సిపల్ జడ్జి, లోక్ అదాలత్ న్యాయమూర్తి జి.వల్లభ నాయుడు అన్నారు. ప్రపంచ బాల కార్మికుల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా కార్మిక శాఖ, జిల్లా విద్యాశాఖ, యాక్సిస్టివ్ జస్టిస్ ఫర్ చిల్డ్రన్ అప్ హోల్డ్ సంస్థ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలలు బాల కార్మికులుగా మారడానికి తల్లిదండ్రులు కూడా ప్రధాన పాత్ర పోషిస్తున్నారన్నారు. నిరక్షరాస్యత, వలస వెళ్లడం, ఇంటి పనులకు పెట్టడం, ఆర్థిక పరిస్థితుల వల్ల బాలలు బాల కార్మికులుగా మారుతున్నారని తెలిపారు. డిప్యూటీ కమిషనర్ లేబర్ సునీత మాట్లాడుతూ బాల కార్మికులను రెస్క్యూ చేయడంలో తమ సమస్త డిస్ట్రిక్ టాస్క్ ఫోర్స్ సభ్యులు విశేషంగా కృషి చేస్తున్నామన్నారు. తిరిగి రిహాబ్లేట్ చేయడం కోసం బాలల సంక్షేమ సమితి, ఇతర డిపార్టుమెంటు, స్వచ్ఛంద సేవా సంస్థలు విశేషంగా కృషి చేస్తున్నాయన్నారు. మండల ఎడ్యుకేషన్ ఆఫీసర్ పి.పుష్యరాగం మాట్లాడుతూ చదువుకోవలసిన బాలలు పనిలోకి వెళ్లడం విచారకరమన్నారు. యాక్సిస్ టు జస్టిస్ అప్ హోల్డ్ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ జి.డేవిడ్ రాజు మాట్లాడుతూ తమ సంస్థ గత సంవత్సరం లేబర్ డిపార్టుమెంటు, మిగిలిన సంస్థలతో కలిసి 2012 మందిని రిస్క్ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వివిధ స్వచ్ఛంద సేవా సంస్థలు ప్రభుత్వ అధికారిణి మమత పాల్గొన్నారు

అర్ధరాత్రి వరకు పడిగాపులు

కొనసాగుతున్న ఎస్జీటీల బదిలీ కౌన్సెలింగ్

ఆరిలోవ: ఉమ్మడి విశాఖ జిల్లాలో సెకెండరీ గ్రేడ్ టీచర్స్(ఎస్జీటీ) బదిలీల కౌన్సెలింగ్‌లో గురువారం 500 మందికి స్థానచలనం కలిగింది. మూడో రోజు కూడా కౌన్సెలింగ్ అర్ధరాత్రి వరకు కొనసాగింది. సీనియార్టీ జాబితాలో 301 నుంచి 800 వరకు ఉన్న ఎస్జీటీలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. జాబితాలో ఉన్న టీచర్లు ఉదయం 9 గంటలకే జిల్లా పరిషత్ సమావేశమందిరానికి చేరుకున్నారు. 10.30కు మొదలైన కౌన్సెలింగ్‌లో రాత్రి 9.30కు 700 మందికి పూర్తయింది. 701 నుంచి 800 వరకు ఉన్న టీచర్ల కౌన్సెలింగ్ పూర్తయ్యేసరికి అర్ధరాత్రి దాటిపోయింది. శుక్రవారం 801 నుంచి 1600 వరకు ఉన్న 800 మంది ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు విశాఖ డీఈవో ఎన్.ప్రేమ్ కుమార్ తెలిపారు. ఆ జాబితాలో ఉన్న ఉపాధ్యాయులు ఉదయం 8.30కే కౌన్సెలింగ్ హాల్‌కు చేరుకోవాలన్నారు. ఇదిలా ఉండగా వేసవి సెలవుల అనంతరం గురువారం పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. ఉమ్మడి విశాఖ జిల్లాలో కౌన్సెలింగ్‌కు హాజరైన 500 మంది ఎస్జీటీలు తొలి రోజే పాఠశాలలకు గైర్హాజరవ్వాల్సి వచ్చింది.

పోలీస్ కస్టడీలో అప్పలనాయుడు విచారణ

తగరపువలస: ఎస్సీ ఎస్టీ కేసులో గత నెల 31న ఆనందపురం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన రౌడీషీటర్ మీసాల అప్పలనాయుడును గురువారం పోలీస్ కస్టడీలో విచారణ చేపట్టారు. ఏసీపీ అప్పలరాజు సమక్షంలో ఆనందపురం పోలీసులు విచారించారు. నగరంలోని రామాటాకీస్ ప్రాంతానికి చెందిన కుంచంగి లక్ష్మి అనే దళిత మహిళను అప్పలనాయుడు భూమి పేరుతో మోసగించి రూ.97 లక్షలు తీసుకున్న సంగతి తెలిసిందే. ఈ డబ్బులు తిరిగి ఇవ్వకపోవడమే కాకుండా బాధితురాలిని వేధించడంతో ఆయనతో పాటు భార్య శ్రీదేవిని కూడా అరెస్ట్ చేశారు. లాయర్ సమక్షంలో విచారణ అనంతరం అప్పలనాయుడును కోర్టులో హాజరుపరిచారు.

జలవనరుల శాఖ బదిలీల్లో అక్రమాలు?

ఉద్యోగుల ఆరోపణ

మహారాణిపేట: జలవనరుల శాఖలో మినిస్టీరియల్ సిబ్బంది బదిలీల్లో అక్రమాలు, అవకతవకలు జరిగాయని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. గురువారం పలువురు ఉద్యోగులు కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు. దళితులు అన్న చిన్నచూపుతో తమకు బదిలీల్లో తీవ్ర అన్యాయం జరిగిందని ఉద్యోగులు వాపోయారు. రాజకీయ పలుకుబడి వల్ల బదిలీల్లో తమకు ప్రాధాన్యత ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఖాళీలు ఉన్నా తనకు పోస్టింగ్ ఇవ్వడంలో ప్రాధాన్యత ఇవ్వలేదని ఉద్యోగిని హైమావతి ఆవేదన వ్యక్తం చేశారు. తమకు అవకాశం ఉన్న సీట్లలో బదిలీలు చేయలేదని, అవకాశం లేని చోట బదిలీలు చేసి ఇబ్బంది పెట్టారన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు పూర్తి చేయాల్సి ఉందని.. కానీ ఇక్కడ కొంతమంది ఇష్టారాజ్యం వల్ల బదిలీలు పూర్తి చేశారన్నారు. ఉద్యోగులు పి.అప్పలరాజు, సి.హెచ్.శ్రీనివాసరావు తదితరులు కూడా బదిలీల్లో అక్రమాలు జరిగాయని ఆరోపించారు.

కూలిన ఉక్కు దీక్ష శిబిరం షెడ్


కూలిపోయిన ఉక్కు దీక్ష శిబిరం షెడ్

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళనల దీక్ష శిబిరం షెడ్ కూలిపోయింది. బుధవారం రాత్రి కురిసిన వర్షానికి తాటాకులతో నిర్మించిన షెడ్డు నేలమట్టమైంది. దీంతో కార్మికులు తమ నిరసనను శిబిరం వెలుపల కొనసాగించాల్సి వచ్చింది. విశాఖ ఉక్కు కర్మాగారం పరిరక్షణ కోసం 2021 ఫిబ్రవరి 12న అఖిలపక్ష కార్మిక సంఘాలు రిలే నిరాహార దీక్షలను ప్రారంభించాయి. ఈ దీక్షల కోసం తాటాకులతో ఈ షెడ్డును నిర్మించారు. సుమారు ఐదేళ్లు కావస్తున్నందున ఎండకు ఎండి, వానకు తడిసి షెడ్డు ఎప్పుడైనా కూలిపోయే పరిస్థితికి చేరుకుంది. ఈ క్రమంలో బుధవారం రాత్రి కురిసిన వర్షానికి షెడ్డు కూలిపోయింది. అయితే ఆందోళనకారులు, కార్మిక సంఘాలు మళ్లీ షెడ్డు నిర్మిస్తాయా లేదా అనేది చూడాలి. ఎందుకంటే ఇటీవల పోలీసులు శిబిరాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని అక్కడే కూర్చున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు తిరిగి షెడ్డు నిర్మాణానికి అనుమతిస్తారా లేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది.

ఏపీ ప్రాక్టీసింగ్ న్యాయవాదుల సంఘం కార్యనిర్వహక కార్యదర్శిగా చక్రవర్తి


చక్రవర్తి

విశాఖ-లీగల్: ఆంధ్రప్రదేశ్ ప్రాక్టీసింగ్ న్యాయవాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శిగా నగరానికి చెందిన పిల్లా నీలకంఠ చక్రవర్తి నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి.రంగారావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన నియామకం పట్ల నగర న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎం.కె.శ్రీనివాస్, రాష్ట్ర బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు ఎస్.కృష్ణమోహన్, సభ్యులు పి.నరసింగరావు, కె.రామజోగేశ్వరరావు, బైపా అరుణ్ కుమార్, ఆలిండియా లాయర్స్ యూనియన్ ఉపాధ్యక్షుడు బీ.వీ.రామాంజనేయరావు, ఇండియన్ లాయర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.ఎస్.సురేష్‌కుమార్, ఉమెన్ అడ్వకేట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షురాలు పప్పు అనురాధ, సీనియర్ న్యాయవాది శకుంతల హర్షం ప్రకటించారు.

టాలెంటెడ్ గేమ్ పేరుతో దోపిడీ


టాలెంటెడ్ గేమ్ ఆడుతున్న దృశ్యం

కూర్మన్నపాలెం : టాలెంటెడ్ గేమ్ పేరుతో కూర్మన్నపాలెంలో భారీ ఎత్తున గలాట జరుగుతోంది. స్థానిక జనసేన నాయకుడు ఇంట్లో రోజూ సాయంత్రం వేళ వందలాది మంది ఆడుతున్నారు. కొందరు వేలాది రూపాయలు నష్టపోతుండగా.. నిర్వాహకులు సొమ్ము చేసుకుంటున్నారు. ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న భవనాన్ని అద్దెకు తీసుకుని యథేచ్ఛగా సాగుతున్న ఈ గలాటకు అన్ని అనుమతులు ఉన్నాయని నిర్వాహకులు చెబుతున్నారు. న్యాయస్థానం కూడా అనుమతిచ్చిందంటూ నిర్వాహకులు ప్రచారం చేసుకుంటున్నారు. అందువల్లే పోలీసులు కూడా అటు వైపు వెళ్లడం లేదని తెలుస్తోంది. దీని వలన ఎన్నో కుటుంబాలు నాశనమవుతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టాలెంటెడ్ పేరుతో ఆడిస్తున్న ఈ దందాకు కొందరు పోలీసులు తమ వంతు సహకారం అందిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అలాగే పెదగంట్యాడ పరిధి దయాల్ నగర్ భక్తాంజనేయ స్వామి ఆలయ సమీపంలో కూడా కొంత మంది ఇదే టాలెంటెడ్ గేమ్ ఆడిస్తూ రోజూ లక్షల్లో దోచుకుంటున్నారు. ఇక్కడ కూడా పోలీసులు సహకారం ఉందనే స్థానికులు చెబుతున్నారు.

వేతనాల కోసం విమ్స్ వైద్యుల ధర్నా


విమ్స్‌లో నల్ల బ్యాడ్జీలు ధరించి ఆందోళన చేస్తున్న కాంట్రాక్ట్ వైద్యులు

ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్)లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ వైద్యులు గురువారం ధర్నా చేపట్టారు. తమ వేతనాలను పెంచాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు కాంట్రాక్ట్ వైద్యులు నల్ల బ్యాడ్జీలు ధరించి విమ్స్ ఆవరణలోని అవుట్ పేషెంట్ విభాగం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ అప్పలనాయుడు, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ హరికృష్ణ, డాక్టర్ హారిక తదితర వైద్యులు మాట్లాడారు. తాము రూ. 92,000 జీతంతో కాంట్రాక్ట్ పద్ధతిలో విమ్స్‌లో చేరి మూడేళ్లు పూర్తయిందని, కానీ ఇప్పటివరకు తమ వేతనాలు పెరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని విభాగాల్లో రోగులకు వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం గతంలో వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చిందని, కానీ ఇప్పటి వరకు స్పందించలేదని వైద్యులు ఆరోపించారు. తమ వేతనాలను రూ.1.60 లక్షలకు పెంచాలని వారు డిమాండ్ చేశారు. వైద్యులు ధర్నా చేసిన రెండు గంటల పాటు రోగులకు వైద్య సేవలు అందక ఇబ్బందులు పడ్డారు.